క్లుప్తంగా

ఎన్నికల ప్రక్రియకు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ చిరంజీవి

వంగర: ఎన్నికల ప్రక్రియకు సహకరించాలని తహసీల్దార్ టి.చిరంజీవి అన్నారు. స్థానిక కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ కొద్ది రోజుల్లో వస్తుందని, ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహణకు అన్ని పార్టీలకు చెందిన నేతలు అధికారులు, పోలింగ్ సిబ్బందికి సహకరించాలని కోరారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలన్నారు. సమావేశంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, ఎంపీడీఓ సింగిరెడ్డి సాల్మన్‌రాజ్, డీటీ బూరాడ సుందరరావు, ఆర్ఐ జామి మురళీ, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బాడంగి: మండలంలో పిన్నవలస, కోడూరు, రామచంద్రాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రాజారావు, ఎంపీడీఓ ఆంజనేయులు బుధవారం సందర్శించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో వసతులు పరిశీలించారు. దివ్యాంగ ఓటర్లు ఓటు వేసేందుకు వీలుగా ర్యాంపులు ఏర్పాటు చేయాలని, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. బీఎల్ఓలకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు.

విద్యాప్రమాణాలు బాగుండాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు బాగుండాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలో కాగితాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల మానసిక వికాసంపై ఆరాతీశారు. ఈ ఏడాది పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. పాఠశాల నిర్వహణ, జగనన్న గోరుముద్ద పథకం సక్రమంగా ఉండడంతో హెచ్ఎం ప్రభాకరరావును అభినందించారు.

వ్యాక్సినేషన్‌తో వ్యాధులు దూరం

వంగర: స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, చిన్నారులకు బుధవారం వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. హెచ్‌వీ తవిటమ్మ, ఏఎన్ఎం విశాలాక్షి ఆధ్వర్యంలో గర్భిణులు, చిన్నారులకు రోటా, పెంటా, ఓపీవీ, ఐపీవీ, మీజిల్స్, విటమిన్-ఎ వ్యాక్సిన్లు వేశారు. సకాలంలో వ్యాక్సిన్లు వేసుకోవడం ద్వారా ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని ఆరోగ్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు సేవలందించారు.

సిద్ధం కిట్లు పంపిణీ



మారేడుబాకలో సిద్ధం కిట్లు అందిస్తున్న రాజగోపాలనాయుడు, తదితరులు

రాజాం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని మారేడుబాక గ్రామంలో పార్టీ కార్యకర్తలకు, బూత్ కన్వీనర్లకు బుధవారం 'సిద్ధం' కిట్లు అందజేశారు. బూత్ కమిటీలతో ఓటర్ల జాబితాలపై సమీక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, యూత్ అధ్యక్షుడు గెడ్డాపు అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సామూహిక సీమంతం



జంగాలవీధి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం చేస్తున్న కార్యకర్తలు

బొబ్బిలి: పట్టణ, మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. పౌష్టికాహారం ప్రాముఖ్యతపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. సీడీపీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సూపర్‌వైజర్ అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాణం నిలిపిన 108

రాజాం సిటీ: అత్యవసర సమయంలో 108 సిబ్బంది వెంటనే స్పందించడం ద్వారా రోగి ప్రాణాలు కాపాడగలిగారు. వివరాల్లోకి వెళితే.. పట్టణ పరిధిలో హరిజనవీధికి చెందిన దిబ్బ సత్యం బుధవారం ఒక్కసారిగా గుండెనొప్పికి గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం ఆస్పత్రికి రిఫర్ చేశారు. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళంలోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. ఈఎంటీ పి.వెంకటరమణ, పైలట్ ఎ.శంకరరావు అంబులెన్స్‌లో అత్యవసర వైద్య సేవలు అందించడంతో సకాలంలో ఆస్పత్రికి తరలించి వైద్య సేవలందించామని సత్యం కుటుంబ సభ్యులు తెలిపారు. సకాలంలో స్పందించిన 108 సిబ్బందిని అభినందించారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



రావివలసలో ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని రావివలసలో రైతుభరోసా కేంద్రం, మిర్తివలసలో అంగన్‌వాడీ భవనాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో పాలనను ప్రజలకు చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. పథకాల మంజూరులో పూర్తి పారదర్శకతను పాటిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అన్నదాతకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని, రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను రైతుభరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోందని, పేద విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేస్తున్నారని అన్నారు. పేద కుటుంబాల భవిష్యత్ బాగుండాలన్నా.. అక్క చెల్లెమ్మల సాధికారత కొనసాగాలన్నా.. ఈ ఎన్నికల్లో మళ్లీ జగనే రావాలన్నారు. రాష్ట్ర చరిత్రలోనే కాదు.. దేశ చరిత్రలో ఏ పార్టీ, ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మేలు చేశారన్నారు. లబ్ధిపొందిన ప్రతి ఒక్కరూ జగన్‌మోహన్‌రెడ్డిని తమ ఓటు ద్వారా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, సర్పంచ్‌లు మజ్జి రాంబాబు, సోముల కుమారి, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, మండల యూత్ అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్, గ్రామ పెద్దలు మజ్జి బాలకృష్ణ, మరడ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఈ ప్రభుత్వంలోనే రాజాం పట్టణం అభివృద్ధి



సీసీ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న తలే రాజేష్, తదితరులు

రాజాం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాతే రాజాం పట్టణంలో అభివృద్ధి జరిగిందని ఆ పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. పట్టణంలోని లచ్చయ్యపేట గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిధులతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. రూ.4 లక్షలతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు వైఎస్సార్ పార్కు వద్ద జిమ్ ఏర్పాటు, బొబ్బిలి సెంటర్‌లో యర్రావాని చెరువును పార్కుగా అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం రాజాంను పూర్తిగా పట్టించుకోలేదని విమర్శించారు. పట్టణవాసులు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, పార్టీ నేతలు నల్లా శ్రీనివాసరావు, దూబ గోపాలం, ఆసపు సూర్యం, శాసపు వేణుగోపాలనాయుడు, తోట తిరుమలరావు, సోరాడ సూరి, పాలవలస శ్యామ్, కోరాడ రామినాయుడు, జేసీబీ శ్రీను, ఒట్టం నీలకంఠం, గోకవలస బాబూరావు, కోల్ల రమ్య, యందవ సుశీల, అల్లెన జయలక్ష్మి, బొల్లా లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో ప్రజల ఆస్తులకు రక్షణ

- ఎమ్మెల్యే శంబంగి



స్వమిత్వ రికార్డు పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నూతన సాంకేతిక విధానాలతో ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని జగనన్న భూరక్ష, భూహక్కు కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి ద్వారా రొంపల్లి, సోంపురం, గొల్లపేట గ్రామాలకు చెందిన ప్రజలకు ఇళ్లు, ఖాళీ స్థలాల హక్కు పత్రాలను బుధవారం ఆయన అందజేశారు. గ్రామాల్లోని ప్రజలకు చెందిన ఇళ్లకు సరైన హద్దులు, కొలతలతో హక్కు పత్రాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే చెందుతుందన్నారు. ఈ పత్రాలను బ్యాంకులో పెట్టి రుణాలు తీసుకునేందుకు అవకాశముందన్నారు. అలాగే క్రయ, విక్రయాలకు పక్కాగా రిజిస్ట్రేషన్ అవుతుందని చెప్పారు. ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ లక్ష్మునాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నేతలు వక్రబుద్ధి మానుకోవాలి



అంబేడ్కర్ జంక్షన్ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాజాం సిటీ: టీడీపీ, జనసేన కార్యకర్తలు వక్రబుద్ధి ఇకనైనా మానుకొని మానవతా దృష్టిలో ఆలోచనలు చేయాలని మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ, జనసేన ట్రోలింగ్‌కు బలైపోయిన గీతాంజలి మృతికి నివాళులర్పించారు. పట్టణంలో బుధవారం రాత్రి కొవ్వొత్తులు వెలిగించి ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో లబ్ధిచేకూరడంతో తన ఆనందాన్ని వ్యక్తపర్చడమే గీతాంజలి చేసిన తప్పా అంటూ ప్రశ్నించారు. ఎవరికి లబ్ధి చేకూరడకూడదన్నదే టీడీపీ, జనసేన నైజమని, ఆ క్రమంలోనే పొత్తులు ఏర్పరుచుకున్నారని దుయ్యబట్టారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేదలందరూ ఎంతో ఆనందంగా ఉన్నారని, వారిని చూసి భజన బ్యాచ్ ఓర్వలేకపోతోందని దుయ్యబట్టారు. గీతాంజలి మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, అల్లెన జయలక్ష్మి, వైవీ సుశీల, రమ్య తదితరులు పాల్గొన్నారు.


కంటి వ్యాధులపై నిర్లక్ష్యం వద్దు



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వసంతరావు

రేగిడి: కంటి వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం చేయరాదని బూరాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.చలమయ్య అన్నారు. ప్రపంచ గ్లూకోమా వారోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీలో బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నేత్ర వైద్య నిపుణుల సలహాలు తీసుకోవడంతో అంధత్వం భారిన పడకుండా కళ్లను కాపాడుకోవచ్చన్నారు. అనంతరం ఆప్తాలమిక్ అధికారి చప్పటి వసంతరావు కంటి సమస్యలతో బాధపడుతున్న పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 12 మందిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ ఎన్.సావిత్రి, పర్యవేక్షకులు డి.సాయికృష్ణ, జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

సంతకవిటి: మండలంలోని రామారాయపురం వై జంక్షన్ వద్ద జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ బూత్ కన్వీనర్లు, కమిటీ సభ్యులు, వలంటీర్ల సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశంలో పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ పాల్గొని మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు మాట్లాడుతూ.. 2024 ఎన్నికల కురుక్షేత్ర యుద్ధానికి అందరం సిద్ధంగా ఉండి జగనన్నను మరోసారి సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం బూత్ కన్వీనర్లకు సిద్ధం పోస్టర్లను అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గంగ్రేటి కేసరి, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

వంగర: మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం ప్రారంభిస్తారని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, జేసీఎస్ మండల కన్వీనర్ కమిడి ఉమామహేశ్వరరావు బుధవారం తెలిపారు. రూ.30 కోట్లతో నాగావళి నదిపై నిర్మించిన రుషింగి-కిమ్మి వంతెనకు వీరఘట్టం మండలం కిమ్మి వద్ద శంకుస్థాపన చేస్తారన్నారు. తలగాం, ఎం.సీతారాంపురం గ్రామాల్లో నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు.

నేడు ఇంటి హక్కుపత్రాల పంపిణీ

బాడంగి: మండలంలోని జగనన్న కాలనీలలో ఇంటి స్థలాలకు చెందిన ఇళ్లపట్టా హక్కుపత్రాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం ఉదయం పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు చేతులమీదుగా ఈ పంపిణీ చేపట్టనున్నట్టు తెలిపారు.

నేడు బొబ్బిలిలో చేయూత లబ్ధిదారుల సమావేశం

బాడంగి: మండలంలోని అర్హులైన చేయూత లబ్ధిదారులకు బొబ్బిలి కళాభారతిలో గురువారం మధ్యాహ్నం నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంటక చినఅప్పలనాయుడు చేతులమీదుగా చెక్కు పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీడీఓ ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని చేయూత లబ్ధిదారులంతా హాజరుకావాలని కోరారు.

గృహకార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాజాం సిటీ: గృహాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సెంటాన్స్ స్త్రీ శక్తి సెంటర్ డైరెక్టర్ సిస్టర్ హిల్డా అన్నారు. స్థానిక సెంటాన్స్ స్త్రీశక్తి కేంద్రంలో గృహ కార్మికులతో బుధవారం సమావేశం నిర్వహించారు. గృహాల్లో పనిచేస్తున్న మహిళలకు కనీస వేతన చట్టం అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆర్థిక పురోగతికి ఎన్నో పథకాలు పెట్టినప్పటికీ గృహ కార్మికులకు సరైన న్యాయం జరగడం లేదని, వారిని ఆదుకోవాలని కోరారు. గృహ కార్మికులంతా ఐకమత్యంతో ముందుకుసాగాలని సూచించారు. సమాజంలో వివక్షను రూపుమాపేందుకు పటిష్టమైన చట్టాలు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. అలాగే గృహాల్లో పనిచేస్తున్న మహిళలంతా తమ హక్కులు సద్వినియోగం చేసుకుని తగిన వేతనం పొందాలని సూచించారు. కార్యక్రమంలో సిస్టర్ జయమేరి, ఆశాజ్యోతి కార్మికుల యూనియన్ అధ్యక్షులు వి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో బహుళ ప్రయోజనాలు



ర్యాలీలో పాల్గొన్న పీఓ రాజ్యలక్ష్మి

బాడంగి: చిరుధాన్యాలతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఐసీడీఎస్ పీఓ రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని రామచంద్రాపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమం అమలుతీరును బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రాగులు, జొన్నలు, గంటెలు, మినుములు, పెసలు, కందులు, తదితర చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను గర్భిణుల, బాలింతలకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహార కిట్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ నాగమణి, కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

బాడంగి: వేసవిలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా చూసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జెడ్పీటీసీ పెద్దింటి రామారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద క్రాస్‌ప్రోగ్రాం వాహనాన్ని బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్లకు మరమ్మతులు చేపట్టేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో క్రాస్‌ప్రోగ్రాం అమలు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో బోర్లు పాడైతే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్తే.. బోరు మెకానిక్‌లు వచ్చి వాటిని బాగుచేస్తారన్నారు. తొలిరోజు మండలంలోని పినపెంకి, పి.గడబవలస గ్రామాల్లో పాడైన బోర్లను బాగుచేశారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందించాలని బూరాడ సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్.నూకాలమ్మ కార్యకర్తలకు సూచించారు. మండలంలోని వండానపేట, అక్కన్నఅగ్రహారం, ఉంగరాడ, ఉంగరాడమెట్ట, చాటాయివలస, ఉప్పర్నాయుడువలస గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాలకు ఎంతమంది పిల్లలు వస్తున్నారు, వారందరికీ సక్రమంగా పౌష్టికాహారం అందిస్తున్నారా లేదా, రికార్డుల నిర్వహణను పరిశీలించి కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

దుకాణం సర్దేసిన ఎన్నారై..



ఫ్లైఓవర్ వద్ద పెట్టిన ఫ్లెక్సీలు తొలగిస్తున్న దృశ్యం

బొబ్బిలి: విజయనగరం పార్లమెంట్ సీటు కోసం ఆశపడిన ఓ ఎన్నారై.. టీడీపీ అధిష్టానం దెబ్బకు వెంటనే దుకాణం సర్దేశాడు. తొందరపడి ఓ కోయిల ముందే కూచిందన్న చందంగా.. ఫ్లెక్సీలతో ఊరూవాడా ప్రచారానికి తెరలేపారు. తనదే సీటు అంటూ ధాంబికాలు పలికారు. ఆ ఎన్నారైకి చంద్రబాబు నైజం తెలియదు కదా! సీన్ రివర్స్‌సైంది. టీడీపీ-జనసేన పొత్తులో మరో పార్టీ బీజేపీకి చోటు ఇచ్చిన చంద్రబాబు ఆ టికెట్‌ను వారికిచ్చేశారు. దీంతో ఫ్లెక్సీలను తీసివేసే పనిలో ఎన్నారై నిమగ్నమయ్యాడు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న డాక్టర్ తలే రాజేష్

సంతకవిటి: మండలంలోని రామారాయపురం గ్రామానికి చెందిన సుమారు 50 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. గ్రామానికి చెందిన టొంపల వాసుదేవరావు, కంట వెంకటరమణ, మురపాక వాసుదేవరావు, టొంపల బాలామణి, బోనాల గౌరీష, టొంపల శ్రీధర్, పంకు సురేష్, మన్నేన సూరయ్య, నల్లబారికి పారయ్య తదితర 50 కుటుంబాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాచారాయపురం మాజీ సర్పంచ్ యెన్ని శ్రీనివాసరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గంగ్రేటి కేసరి, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష చారిత్రాత్మకం



రాజాం సిటీ: ఆరోగ్య సురక్ష బుక్‌లెట్‌ను అందిస్తున్న కమిషనర్, తదితరులు

బొబ్బిలి: రాష్ట్ర చరిత్రలోనే అధిక సంఖ్యలో రోగులకు వైద్య సేవలందించిన కార్యక్రమంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' నిలిచిపోతుందని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు అన్నారు. మున్సిపాలిటీలో 14,18 వార్డుల పరిధిలోని కుమ్మరివీధి సచివాలయ వద్ద 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ.. ఆరోగ్య రంగంలో విప్లవాత్మక సేవలందిస్తున్న ఈ కార్యక్రమం రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చనున్నదన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు చెలికాని మురళీ కృష్ణ, రమాదేవి, కౌన్సిలర్ ఎస్.శ్రీలక్ష్మి, 18వ వార్డు ఇన్‌ఛార్జి బూడి ఆనంద్, పట్టణ ప్రణాళికాధికారి వరప్రసాదరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో ఇంటి వద్దకే వైద్యం

రాజాం సిటీ: ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు అన్నారు. మున్సిపాలిటీ పరిధి ఇందిరమ్మ కాలనీ సచివాలయం వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులు, ఆస్పత్రికి వెళ్లలేని రోగులకు ప్రభుత్వం ఇంటి వద్దకే వైద్యులను పంపించి ఆరోగ్య సేవలందించడం గొప్ప ఆలోచన అని అన్నారు. కార్యక్రమంలో మేనేజర్ ఎంవీ నాగరాజు, వైద్యులు అనూష, ప్రవీణ, శైలజ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న అందరికీ ఉపాధి పని

రాజాం: మండలంలో జాబ్‌కార్డులు ఉన్న వేతనదారులందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ బాసూరీ శంకరరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్‌లతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా చేపడుతున్న ఉపాధి పనులపై ఆరాతీశారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి వందరోజులు పని పూర్తిచేయాలని సూచించారు. రెండు పూటలా పనులు చేపట్టడంతో పాటు రోజుకు రూ.272లు వేతనం అందేలా పనులపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సాయిరాం పాల్గొన్నారు.

ఉపాధిపనులు పరిశీలన

రేగిడి: మండలంలో పారంపేట, కాగితాపల్లి, వన్నలి తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ ఎస్.హరనాథరావు బుధవారం పరిశీలించారు. వేతనదారుల మస్టర్ సీట్లు వెరిఫికేషన్ చేశారు. వేతనదారులు రెండుపూటలా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ పార్థసారథి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



భువన విజయం నాటికను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సంతకవిటి: మండలంలోని బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం మల్లేశ్వరరావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ.. క్రమశిక్షణతో విద్యనభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన జీనియస్ యువత పదో తరగతి విద్యార్థులకు రైటింగ్ ప్లాంక్స్ అందించారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయుడు కృష్ణ దర్శకత్వంలో పాఠశాల విద్యార్థులు భువన విజయం నాటిక, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అదపాక దామోదరరావు, లక్ష్మిభాను, సత్యనారాయణ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

రేగిడి: ప్రతిరోజు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రోగనిరోధకశక్తి మెరుగుపడుతుందని జీసీఎస్ఆర్ కళాశాల జంతుశాస్త్ర విభాగాధిపతి బాలు రవి అన్నారు. మండలంలోని బాలకవివలస గ్రామంలో జీసీఎస్ఆర్ కళాశాల జాతీయ సేవాపథకం-1 ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక సేవా శిబిరం నిర్వహించారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మనిషి మనుగడకు, ఆరోగ్యానికి పోషకాలు ఎంతో ముఖ్యమని, కాయగూరలు, ఆకుకూరలతో పాటు గుడ్లు, పాలు, మాంసాహారాన్ని తీసుకోవడం ద్వారా శరీరానికి కావాల్సిన అన్ని రకాల పోషకాలు అందుతాయన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్ రక్తనమూనాలు సేకరించారు. ఈనెల 14న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు.